సాక్షి
కామారెడ్డి
సోమవారం । 18 । ఆగస్టు । 2025



నిధులు లేక నిలిచిన పనులు

నస్రుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్‌లో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణం నిధులు లేక నిలిచిపోయింది.

- 9లో ▸



వానలో తడుస్తూ..

రామారెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.5 /21.9

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'శక్తిమంతమైన దేశంగా చేయడమే సంఘ్ లక్ష్యం'



మద్నూర్: భారత్‌ను శక్తిమంతమైన దేశంగా చేయడమే సంఘ్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ్ కోటూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో జుక్కల్ ఖండ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ్‌ను స్థాపించి వందేళ్లవుతున్న సందర్భంగా ప్రతి గ్రామంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపన ఆవశ్యకత, లక్ష్యం గురించి ప్రజలకు వివరించాలన్నారు. వందేళ్ల ప్రస్థానంలో దేశ సేవకు నిస్వార్థంగా పని చేసిన స్వయం సేవకులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ సంతోష్, జుక్కల్ ఖండ కార్యవాహ జుబ్రె సంజు, మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ మండలాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

'స్వదేశీ వస్తువులను వినియోగించాలి'



కామారెడ్డి అర్బన్: దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రజలందరు మద్దతు ఇవ్వాలని, స్వదేశీ వస్తువులనే వినియోగించాలని స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) తెలంగాణ రాష్ట్ర సహ సంయోజక్ అశోక్ కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని శ్రీసర్వసతి విద్యామందిర్ హైస్కూల్‌లో ఎస్‌జేఎం జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు, విదేశీ వస్తువులపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. భారత్‌ను వ్యతిరేకించే దేశాల వస్తువులను కొనుగోలు చేయవద్దన్నారు. స్వదేశీ వస్తువుల వినియోగంతో స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నాసిరకం చైనా వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌జేఎం ఇందూర్ విభాగ్ సహ సంయోజక్ రాజాగౌడ్, తెలంగాణ ప్రాంత యువ ప్రముఖ్ రాహుల్‌కుమార్, జిల్లా సంయోజక్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ ఎస్‌ఈగా జగదీశ్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌గా జగదీశ్ రానున్నారు. కంతనపల్లి ప్రాజెక్ట్ ఈఈగా పని చేస్తున్న ఆయనకు పదోన్నతి లభించింది. ఎస్సారెస్పీ ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఏడాదిపాటు శ్రీనివాస్‌గుప్తా పని చేశారు. నూతన ఎస్‌ఈ సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌ను కప్పేస్తున్న టేకు చెట్లు



కామారెడ్డి అర్బన్: భారత వాతావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కామారెడ్డి పాత తహసీల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ రెయిన్ గేజ్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గతంలో వర్షపాతం కొలవడానికి పాత పద్ధతులుండగా ప్రస్తుతం మనుషుల అవసరం లేకుండా ఉపగ్రహం ద్వారా ఆటోమేటిక్‌గా తెలిసిపోతుంది. కానీ రెయిన్ గేజ్ కేంద్రంపై ఎలాంటి చెట్లు అడ్డుగా ఉండకూడదు. చెట్ల ఆకులు అడ్డుగా ఉంటే సరైన వర్షపాతం నమోదు కాదు. ఆకులపై నీళ్లు నిలిచి ఒకేసారి పడితే వర్షపాతం ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉంటుంది. రెయిన్ గేజ్ కేంద్రానికి గోడుగుగా ఓ వైపున పెద్ద పెద్ద టేకు చెట్లు ఉన్నాయి. కేంద్రంలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయింది. వీటి వల్ల వర్షపాతం తప్పుగా నమోదయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు. జలవనరుల నిర్వహణ, వ్యవసాయం, వాతావరణ అధ్యయనాలకు ఉపయోగపడే నిరంతర డేటాను తప్పుగా చూపితే నష్టం జరిగే అవకాశం ఉంటుంది. కాగా ఆటోమెటిక్ రెయిన్ గేజ్ కేంద్రం నిర్వహణతో తమకు సంబంధం లేదని, చెట్లు ఉన్నా ఏమీ కాదని మండల గణాంకాధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

■ కామారెడ్డికి చెందిన ఓ ఉపాధ్యాయుడు.. తనకు తెలిసిన వాళ్లు ఓ చిట్‌ఫండ్ సంస్థలో చిట్టీ తీసుకున్నామని ష్యూరిటీగా ఉండాలని బతిమాలితే సంతకం పెట్టాడు. చిట్టీ డబ్బులు తీసుకుని వాడుకున్న వ్యక్తి.. ఆ తర్వాత డబ్బులు చెల్లించకపోవడంతో చిట్‌ఫండ్ యాజమాన్యం ష్యూరిటీగా ఉన్న టీచర్‌కు నోటీస్ పంపించింది. అది చదివి ఆయన విస్తుపోయారు. చిట్టీ తీసుకున్న వ్యక్తి బతికే ఉన్నా.. ఆ వ్యక్తికి ఆస్తులు ఉన్నా పట్టించుకోని చిట్‌ఫండ్ యాజమాన్యం తనకు నోటీసు పంపడం ఏమిటని సంస్థ కార్యాలయానికి వెళ్లి నిలదీశాడు. మీరు భరోసా ఇవ్వడం వల్లే చిట్టీ డబ్బులు ఇచ్చామని సదరు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. డబ్బులు కట్టకుండా సదరు టీచర్ మొండికేయడంతో కోర్టు నోటీసులు పంపించారు.

■ కామారెడ్డికి చెందిన జిరాక్స్, బుక్‌స్టాల్ యజమాని ఒకరు తన బంధువుకు చిట్‌ఫండ్ కంపెనీ చిట్టీ విషయంలో ష్యూరిటీ ఇచ్చారు. చిట్టీ డబ్బులు తీసుకున్న వ్యక్తి నెలనెలా వాయిదాలను చెల్లించకపోవడంతో ఆ చిట్‌ఫండ్ సంస్థ ష్యూరిటీ ఉన్న జిరాక్స్ సెంటర్ యజమానికి నోటీసులు పంపించింది. అదే సంస్థలో తనకు ఉన్న చిట్‌కు సంబంధించిన డబ్బు ఇవ్వడానికి ష్యూరిటీ లింక్ పెట్టి వేధించింది. ష్యూరిటీ ఉన్న పాపానికి ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు తీసుకున్న వ్యక్తి గానీ, చిట్టీ తీసుకున్న వ్యక్తిగానీ బతికే ఉండి, ఆస్తులు కలిగి ఉన్నా వారిని వదిలి తమను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నిస్తున్నారు. అయితే ఆ విషయాలు తమకు తెలియదని, ష్యూరిటీ ఇచ్చేముందే ఆలోచించాలని సదరు సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

పూచీ.. పేచీ..



- అప్పు తీసుకున్నోళ్లను వదిలేస్తున్న ఫైనాన్స్ సంస్థలు
- జమానత్‌దారులకు వేధింపులు
- డబ్బులు చెల్లించాల్సిందేనంటూ నోటీసులు
- లబోదిబోమంటున్న ష్యూరిటీ ఇచ్చినవారు
- దగ్గరి వాళ్లకూ పూచీ ఇవ్వడానికి వెనకడుగు వేసే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు కార్పొరేట్, ప్రైవేటు బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో రుణగ్రహీతకు సంబంధించిన ఏదేని ఆస్తిని తనఖా పెట్టుకుంటాయి. తీసుకున్న రుణం చెల్లించలేని పక్షంలో వారిపై పలు రకాలుగా ఒత్తిడి తీసుకువస్తారు. ఇక చెల్లించకుండా మొండికి వేసినపుడు తనఖా పెట్టుకున్న ఆస్తులను చట్ట ప్రకారం సీజ్ చేసి, వేలం నోటీసులు జారీ చేస్తాయి. అయినా చెల్లించకుంటే వేలం వేసి తమకు రావలసిన బాకీని తీసుకుంటాయి. అయితే ఫైనాన్స్, చిట్స్ వ్యాపారాలు నిర్వహించే సంస్థలు.. అప్పు ఇవ్వడానికి గానీ, చిట్టీ డబ్బు చెల్లించడానికి గానీ ష్యూరిటీలు అడుగుతాయి. అది కూడా ప్రభుత్వ ఉద్యోగులే ఉండాలన్న నిబంధన పెడతాయి. తమ అవసరం కోసం తెలిసిన వాళ్లు, బంధువులు, స్నేహితులను బతిమాలుకుని ష్యూరిటీగా సంతకాలు పెట్టిస్తాయి. అంతవరకు బాగానే ఉంటుంది.

అయితే అప్పు తీసుకున్న వ్యక్తి గానీ, చిట్టీ డబ్బులు తీసుకున్న వ్యక్తి గానీ వాయిదాలు చెల్లించని పక్షంలో ఒకటి రెండు పర్యాయాలు అడిగి, తరువాత రుణగ్రహీతను వదిలేసి ష్యూరిటీ సంతకం చేసిన వారికి నోటీసులు పంపిస్తున్నాయి. అప్పు తీసుకున్న వ్యక్తి అందుబాటులో లేని పక్షంలో, ఆ వ్యక్తి తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నపుడు ష్యూరిటీ వద్దకు వెళ్లాల్సిన ఫైనాన్స్, చిట్స్ నిర్వాహకులు, సంస్థలు.. ష్యూరిటీ ఇచ్చిన వ్యక్తి ఇంటికి వెళ్తుండడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.

కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి..

చిట్‌ఫండ్, ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పు తీసుకున్నవారు, చిట్టీ డబ్బులు తీసుకున్నవారు దర్జాగా ఉంటే ష్యూరిటీదారులు మాత్రం కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. డబ్బులు కట్టేంతవరకు ఫైనాన్స్ సంస్థలు, చిట్‌ఫండ్‌ల నుంచి నోటీసుల మీద నోటీసులు వస్తూనే ఉంటున్నాయి. దీంతో ష్యూరిటీ ఇచ్చిన వారు అప్పు తీసుకున్న వారి వద్దకు వెళ్లి బతిమాలుకోవాల్సి వస్తోంది. తమకు వచ్చే జీతం తమ అవసరాలకు కూడా సరిపోవడం లేదని, ష్యూరిటీ ఉన్నందుకు ఎక్కడి నుంచి తేవాలంటూ కొందరు కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తున్నారు. ఉద్యోగానికి సెలవు పెట్టి కోర్టులకు తిరగాల్సి వస్తోందని పూచీ పడిన ఓ ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ష్యూరిటీకి వెనకడుగు..

ష్యూరిటీ పెట్టిన పాపానికి కొందరు ఇబ్బందులు పడుతుండడంతో.. వారి అనుభవాలను చూస్తున్న ఇతరులెవరూ తమకు దగ్గరి వ్యక్తులకు సైతం ష్యూరిటీ ఇవ్వడానికి ముందుకు రావడం లేదని తెలిసింది. తన శక్తి మేరకు ఎంతోకొంత సాయం అందిస్తా గానీ, ష్యూరిటీ మాత్రం ఉండనంటూ కొందరు చేతులెత్తేస్తున్నారు. చాలా చిట్‌ఫండ్ సంస్థల్లో అవసరానికి చిట్టీ తీసుకున్న వ్యక్తులకు ష్యూరిటీలు దొరకని పరిస్థితి తలెత్తుతోంది. కొందరు నెలల తరబడిగా ష్యూరిటీల కోసం తెలిసిన వారినల్లా అడుగుతున్నారు. ష్యూరిటీ పెడితే వచ్చే ఇబ్బందులను చెబుతూ కొందరు.. తాము ఇప్పటికే వేరే వాళ్లకు జమానత్ ఉన్నామంటూ మరికొందరు తప్పించుకుంటున్నారు. దీంతో చిట్టీలు ఎత్తుకున్నవారికి ష్యూరిటీ ఇచ్చేవారు కరువవుతున్నారు.

గుంతల దారి..



భవానీనగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



కల్కినగర్ రోడ్‌నంబర్-4 లో గుంతలు

జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మరింతగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని భవానీనగర్ కాలనీలో రోడ్లపై గుంతలు ఏర్పడి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్కినగర్ వీధి నంబర్ -4 లో కూడా రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. –సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఇది మట్టి రోడ్డు కాదు.. సీసీ రోడ్డే!

బాన్సువాడ : ఈ చిత్రంలో కనిపిస్తున్న సీసీ రోడ్డు ఎక్కడో మారుమూల గ్రామంలో ఉంది అనుకుంటే పొరపాటే. బాన్సువాడ పట్టణం నడిఒడ్డున ఉన్న సీసీ రోడ్డు ఇది. పట్టణంలోని సంగమేశ్వర చౌరస్తా సమీపంలో ఉన్న మజీద్ నుంచి పాత బాన్సువాడ వినాయకనగర్, మండలంలోని కొల్లూర్, నాగారం వెళ్లే వారికి ఈ రోడ్డు మీదుగా వెళ్తే సుమారు మూడు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీంతో ప్రతిరోజు వందలాది వాహనాలు, వందలాది పాదచారులు ఈ రోడ్డుపైనుంచి వెళ్తుంటారు. 2007–08లో ఇక్కడ సీసీ రోడ్డు వేశారు. ఈ మధ్య దారంతా గుంతలమయంగా మారింది. ప్రస్తుతం ఈ రోడ్డుపై నడవాలంటే పాదచారులూ నరకం చూస్తున్నారు. వాహనదారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గత్యంతరం లేక పాదచారులు, విద్యార్థులు రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఈ డ్రెయినేజీ కూడా నిండుగా ప్రవహిస్తుంది. అదుపుతప్పి కాలు జారి డ్రెయినేజీలో పడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పాత బాన్సువాడ గూడెంగల్లీలో సీసీ రోడ్డు దుస్థితి

పంటలను ఆశిస్తున్న తెగుళ్లు



నర్వ శివారులో వరి పైరుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

- జోరుగా పురుగు మందుల పిచికారీ

నిజాంసాగర్ : వానాకాలం సాగు చేస్తున్న వరితో పాటు ఆరుతడి పంటలను తెగుళ్లు వెంటాడుతున్నాయి. వ్యవసాయానికి వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. అయితే ఎండలు.. లేకపోతే అధిక వర్షాలు.. పంటలను దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం పంటపొలాల్లో నీరు నిలుస్తుండడంతో తెగుళ్ల బారిన పడుతున్నాయి. ప్రధానంగా వరి పైరుకు తెగుళ్ల బెడద అధికం అయ్యింది. మొన్నటి వరకు మొగిపురుగు బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు పురుగు మందులను పిచికారీ చేశారు. ప్రస్తుతం పంటపొలాలపై పచ్చ పురుగు దాడి చేస్తోంది. దీంతో తెగుళ్ల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. వర్షాలు తగ్గిన తర్వాతే మందులు పిచికారీ చేయాలని మహమ్మద్‌నగర్ మండల వ్యవసాయాధికారి నవ్య సూచిస్తున్నారు. పచ్చ పురుగు నివారణకు కోరాజెన్ 60 ఎంఎల్ మందును ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పంటపొలాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వర్షం.. నష్టం

- నీట మునిగిన పంటలు
- ఆందోళనలో రైతులు



నాగిరెడ్డిపేటలో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న ఏఈవో దివ్య





పర్మళ్లలో నీట మునిగిన టమాట పంటను చూపుతున్న రైతు, దెబ్బతిన్న బీర పంట

నాగిరెడ్డిపేట : భారీ వర్షాలు, వరదలతో మండలంలోని మంజీర పరీవాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. సింగూర్ ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు దిగువకు విడుదలవడంతోపాటు పోచారం ప్రాజెక్టు అలుగుపై నుంచి దిగువకు పొంగిపొర్లుతున్న వరదనీటితో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా మంజీరనదిలో దట్టంగా పెరిగిన తుమ్మ చెట్ల కారణంగా నీటిప్రవాహ వేగం తగ్గి వరదనీరు మంజీరనది ఒడ్డున ఉన్న పంట పొలాల్లోకి చేరుతోంది. ఫలితంగా మండలంలోని గోలిలింగాల, చీనూర్, వాడి, నాగిరెడ్డిపేట, లింగంపేట, వెంకంపల్లి, మాటూర్ తదితర గ్రామాల శివార్లలో వరిపంటలు మంజీరనీటితో ముంపునకు గురయ్యాయి. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురవుతున్న పంటలను పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండలంలో మంజీరనీటి వల్ల సుమారు 150 ఎకరాలు నీటమునిగాయని ఏవో సాయికిరణ్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు 'సాక్షి'తో పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయించేందుకు బాన్సువాడ ఎమ్మెల్యేతోపాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడానన్నారు.

లింగంపేట మండలంలో..

లింగంపేట: భారీ వర్షాలతో వాగులు ఉప్పొంగుతున్నాయి. వరదలతో పలుచోట్ల పంటలు నీట మునిగాయి. లింగంపేట మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి సంగారెడ్డి, మోతె, సురాయిపల్లి, అయిలాపూర్ తదితర గ్రామాలలో రైతులు టమాట, బీర, కాకర, పచ్చిమిర్చి, బెండకాయ, చిక్కుడు, ఆకుకూరలు, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల వల్ల పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చాలి

- డీవైఎస్‌వో పవన్‌కుమార్
- ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక

నిజామాబాద్ నాగారం : రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీవైఎస్‌వో పవన్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ మహిళా, పురుషుల జట్టు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవైఎస్‌వో పవన్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడాకారులు నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. తాను కూడా మొదట బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడినేనని గుర్తు చేశారు. అనంతరం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా జిల్లా సంఘం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పతకాలు సాధిస్తుందన్నారు. జిల్లా క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ కోర్టుకు స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. వారు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే 71వ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేష్, కార్యవర్గ సభ్యులు భాగ్యశ్రీ, గీత, సింధూజ, సీనియర్ క్రీడాకారులు ఆనంద్, కార్తిక్, సాయికుమార్, పూజ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో డీవైఎస్‌వో పవన్‌కుమార్

ప్రాజెక్టు సమాచారం..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి..



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారుతుండడంతో సోమవారం గేట్లు ఎత్తనున్నారు. ఎగువన ఉన్న పోచారం ప్రాజెక్టుతో పాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట, మంజీర నది, సింగూరు ప్రాజెక్టుల ద్వారా ఆదివారం 90వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోగా వస్తోంది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8టీఎంసీలు కాగా.. ఆదివారం రాత్రి వరకు 1,402.37 అడుగుల (14.162 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి తరువాత గేట్లు ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదలశాఖ ఈఈ సోలోమాన్ తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం ప్రాజెక్టును సందర్శించనున్నారు.

ఈనెల 8 నుంచి ప్రాజెక్టులోకి వచ్చిన వరద నీరు (ఎంసీఎఫ్‌టీల్లో..)

తేదీ	ఇన్‌ఫ్లో		
08	52.27	11	447.90
09	111.22	12	183.56
10	405.19	13	194.79
		14	359.16
15	1.681 టీఎంసీలు		
16	2.988 టీఎంసీలు		
17	2.089 టీఎంసీలు		

'పోచారం'లోకి తగ్గిన ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట : ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో పోచారం ప్రాజెక్టులోకి ఆదివారం వరద తగ్గుముఖం పట్టింది. శనివారం 12 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా.. ఆదివారం సాయంత్రానికి 3,954 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టంతో నిండుగా కళకళలాడుతోంది. అదనంగా వస్తున్న వరదలో 100 క్యూసెక్కుల నీరు పోచారం ప్రధాన కాలువలోకి విడుదలవుతుండగా 3,854 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు అలుగుపై నుంచి మంజీర నదిలోకి వెళ్తోంది. ప్రాజెక్టు వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బందోబస్తును కొనసాగిస్తున్నారు.

కౌలాస్ ఐదు గేట్ల ఎత్తివేత

నిజాంసాగర్(జుక్కల్): కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఆదివారం రాత్రి ఇన్‌ఫ్లో ఒక్కసారిగా 22వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో అర్ధరాత్రి ఐదు గేట్లను ఎత్తి 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ రవిశంకర్ తెలిపారు. కౌలాస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా ఆదివారం రాత్రి వరకు 458 మీటర్ల (1.230 టీఎంసీల) నీరు నిల్వ ఉందన్నారు.

కల్యాణిలోకి 100 క్యూసెక్కులు..

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. ప్రాజెక్టులోకి ఆదివారం వంద క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులకుగాను 408.30 అడుగుల నీటిని నిలువ ఉంచుతూ అదనంగా వస్తున్న వంద క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

అంబులెన్సులో ప్రసవం



పెర్కిట్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన రవిత ఆదివారం 108 అంబులెన్సులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మచ్చర్లకు చెందిన రవిత ఆదివారం కాన్పు నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్సు సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో శిశువుకు జన్మనిచ్చింది. అంబులెన్సు సిబ్బంది ప్రథమ చికిత్సలు అందించి దేగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంబులెన్సు సిబ్బంది రమేశ్, శాంత, ఆశా వర్కర్ పుష్పకు కృతజ్ఞతలు తెలిపారు.

కిటికీ ఊచలు తీసి దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని మహాలక్ష్మి కాలనీ నాగటవర్స్‌లో ఉంటున్న బేవసాని విఠల్ ఇంట్లో దుండగులు కిటికీల ఊచలు తీసి దొంగతనం చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విఠల్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని రాత్రి రెండు గంటల ప్రాంతంలో గదిలో నిద్రపోయారు. దుండగులు పక్క రూమ్‌లో ఉన్న కిటీకల ఊచలు తొలగించి లోపలికి ప్రవేశించారు. ముందుగా కుటుంబ సభ్యులు పడుకున్న రూమ్‌కు గొళ్లెం పెట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.12 తులాల బంగారం, 30 తులాల వెండి దొంగతనం చేశారు. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పాలు పోసే అతను రావడంతో విషయం గమనించి డోరు తీశారు. విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పైపు లైన్‌కు లీకేజీలు.. వృథాగా నీరు..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి పోచంపాడ్‌కాలనీకి నీటిని సరఫరా చేసే పైపు లైన్‌కు లీకేజీలు ఏర్పడటంతో నీరు వృథాగా పోతుంది. లీకేజీల గురించి పట్టించుకోకుండా నీటిని అలానే సరఫరా చేస్తున్నారు. దీంతో నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తుంది. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో ప్రాజెక్ట్ నుంచి సిమెంట్ పైపులు వేశారు. ప్రస్తుతం ఆ పైపులకు లీకేజీలు ఏర్పడ్డాయి. వర్షకాలం కావడంతో తాగునీరు కలుషితమవుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ

- ఇళ్ల మధ్య పొదలతో ఇబ్బందులు
- నిలుస్తోన్న వర్షపు నీరు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

దోమకొండ: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో వర్షపు నీరు నిలిచి చుట్టూ పక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలాల్లో, గ్రామాల్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉన్నాయి. స్థలాలను కొనుగోలు చేసిన యజమానులు వాటిలో ఎలాంటి నిర్మాణాలు చేయకుండా వదిలేయగా, పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొత్తగా మండల కేంద్రాలతో పాటు, జిల్లా కేంద్రం ఏర్పడగా చాలా మంది ప్లాట్లు కొనుగోలు చేసి ఎలాంటి నిర్మాణాలు చేయకుండా ఖాళీగా ఉంచారు. దీంతో చుట్టుపక్కల ఇళ్ల వారు చెత్త చెదారం అక్కడే వేస్తున్నారు.

విష పురుగులు, కీటకాల సంచారం..

జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు ఉండటంతో వాటిని ఆనుకుని ఉన్న ఇళ్లలోకి విష పురుగులు, కీటకాలు వస్తున్నాయి. చెట్లు ఏపుగా పెరిగి, వాననీటికి తడిసి చిత్తడిగా మారుతున్నాయి. పాములు, తేళ్లు, విష కీటకాల కాటుకు గురువుతున్నట్లు బాధితులు తెలుపుతున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు మురికి కాలువను సైతం తీయడం లేదని, మురికి నీరుతో దుర్గంధం వస్తుందని ప్రజలు వాపోతున్నారు. దోమకొండ మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరించినా మురికి కాలువలు నిర్మించలేదు. దీంతో వర్షపు నీరు ఇళ్లలోకి రాగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



దోమకొండలో మురికి కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డు పక్కనే నిలిచిన మురికి నీరు



జనావాసాల మధ్య మొలిచిన పిచ్చి మొక్కలు

జీపీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి



ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉండగా, వర్షాకాలం మొక్కలు పెరిగి విష పురుగులు వస్తున్నాయని మండల కేంద్రానికి చెందిన పలువురు మా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంలో వెంటనే పంచాయితీ అధికారులకు సూచనలు చేశాం. సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మాకు సమాచారం ఇవ్వాలి.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, దోమకొండ

గ్రంథాలయాల సేవలను మెరుగుపర్చేందుకు కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

బోధన్: జిల్లాలో గ్రంథాలయ శాఖలను పటిష్టం చేసి పాఠకులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే గ్రంథాలయ శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన సాలూర మండల కేంద్రంలో నూతనంగా గ్రంథాలయ శాఖ ఏర్పాటు కోసం కొత్త భవన నిర్మాణానికి గ్రామస్తులు ఎంపిక చేసిన స్థలాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్దన్, గ్రామపెద్దలతో కలిసి పరిశీలించారు. కొత్త భవనం నిర్మాణం అయ్యే వరకు సహకార సంఘం కోసం ఇటీవల కొత్తగా నిర్మించిన రెండు గదుల భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయనను గ్రామపెద్దలు సన్మానించారు. విశ్రాంత హెచ్ఎం ఇల్తెపు శంకర్, ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ శివకాంత్ పటేల్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్, గ్రామ పెద్దలు కేజీ గంగారాం, లక్ష్మణ్ గౌడ్, కన్నె రమేశ్, సాక్కం రవి తదితరులు పాల్గొన్నారు.



సాలూరలో భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేక కోచింగ్ సెంటర్ త్వరలో ప్రారంభమవుతుందని యూనివర్సిటీ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శ్రీను రాథోడ్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం యూనివర్సిటీలో ఆవిష్కరించారు. ఉద్యోగాలకు ప్రిపేరయ్యే వారి కోసం అనలాగ్ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తుందన్నారు. నిరుద్యోగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ విద్యార్థులు రాము, సచిన్, శివరాం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూత్‌పల్లిలో స్వయంభూ శివలింగం



నూత్‌పల్లి శివారులోని రాజరాజేశ్వర స్వామి ఆలయం (ఇన్‌సెట్లో) ఆలయంలోని శివలింగం

మీకు తెలుసా?

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లిలో స్వయంభూ లింగ క్షేత్రం ప్రత్యేక చరిత్రను సంతరించుకుంది.ఈ ఆలయంలోని శివలింగం పశువుల పేడ కింద వెలిసినట్లు,గుడిలోని నంది ఎగిరి వచ్చినట్లుగా గ్రామస్తులు పేర్కొంటున్నారు.

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి ఆనుకున్న ఉన్న ఈ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని 150 ఏళ్ల క్రితమే రాతితో నిర్మించారు.
- వందల ఏళ్ల క్రితం చంద్రయ్య మహారాజ్ అమ్మమ్మ ఒకనాడు పిడకల కోసం పశువులు ఉండే ఊరి కొండ ప్రాంతానికి వెళ్లింది. ఆమె పేడను తీసే క్రమంలో శివలింగం బయటపడింది. విషయం తెలుసుకున్న చంద్రయ్య మహారాజ్ ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసి గుడిని నిర్మించారు.
- రాజరాజేశ్వర స్వామిపై చంద్రయ్య భజన, కీర్తనలు రచించి గ్రామగ్రామాన సంచరించి భక్తి ప్రచారం చేసి, శివుడిలో ఐక్యమైనట్లు స్థలం పురాణం ఉంది. ఆయన సమాధి కూడా గుడికి కొద్ది దూరంలో ఉంది.
- చంద్రయ్య మహారాజ్ ఓ దొరగారింట్లో భక్తి, కీర్తనలు చేశారు. విని తరించిన దొర కానుకగా ఏమివ్వాలని చంద్రయ్యను అడిగారట. దొర ఇంట్లో ఉన్న నంది విగ్రహం కావాలని కోరారట. చంద్రయ్య నందిపై మంత్ర పుష్పాలు వేయగానే దానికి చలనం వచ్చి ఐదు మూరలు రంకెలు కొట్టి నూత్‌పల్లి శివాలయానికి ఎగిరి వచ్చినట్లు స్థల పురాణం.
- ప్రస్తుతమున్న నూత్‌పల్లి గ్రామానికి పురాతన ఆలయం ఐదు కిలో మీటర్ల దూరంలో ఉండగా, దీనిని ప్రతీకగా గ్రామంలోనే మరొక కొత్త గుడిని నిర్మించి అక్కడే ప్రతి ఏటా అక్టోబర్‌లో జాతర నిర్వహిస్తారు.

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల చెల్లింపులు ఇలా..

సమాచారం



ఖలీల్‌వాడి: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల నిధులు అందిస్తుంది. దీనిని నాలుగు విడతల వారీగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తుంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించే స్థలంలో ముగ్గు పోయగానే సంబంధిత అధికారులు కొలతలు వేసి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇంటి యాప్‌లో ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ తర్వాత విడతల వారీగా నిధులు మంజూరవుతాయి. అవేంటో తెలుసుకుందాం..

మొదటి విడత

ఇంటి బేస్మెంట్ నిర్మాణం పూర్తికాగానే మున్సిపల్ వార్డు ఆఫీసర్, గ్రామ పంచాయతీ స్థాయిలో సెక్రెటరీ ఇంటి వద్దకు వచ్చి పరిశీలన చేసి ఫొటో తీసుకుంటారు. దానిని సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తే మండల ఏఈకి వెళ్తుంది. దీనిని ఏఈ నుంచి డీఈకి లాగిన్ అవుతుంది. డీఈ నుంచి పీడీకి చేరుతుంది. పీడీ కలెక్టర్ లాగిన్‌కు పంపిస్తారు. కలెక్టర్ పంపిన వివరాలు అన్ని పరిశీలించిన రూ. లక్ష నగదును లబ్ధిదారుని ఖాతాల్లో జమ చేస్తారు.

రెండో విడత

రెండో విడతలో మరో రూ. లక్ష మంజూరువుతుంది. ఈ నిధులు మంజూరు కావాలంటే స్లాబు వేసేంత ఎత్తు గోడలు నిర్మించాల్సి ఉంటుంది.

మూడో విడత

మూడో విడతలో మరో రూ. రెండు లక్షలు నిధులు మంజూరు అవుతాయి. దీని కోసం ఇంటి పైకప్పు సిమెంట్ స్లాబ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫీల్డ్ అధికారులు ఇంటిని పరిశీలించి ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

నాలుగో విడత

ఇక నాలుగో విడతలో రూ. లక్ష మంజూరవుతుంది. ఈ నిధులు మంజూరు కావాలంటే ఇంటికి ప్లాస్టరింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటికి రంగులు వేసి ఉండాలి. అధికారులు అన్ని పనులు పూర్తయ్యాయా లేదా అని పరిశీలించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత రూ. లక్ష నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ఎర్రాపహాడ్‌లో ఉట్టిని కొడుతున్న యువకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. మహిళలు, యువకులు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన కూడలిలోయువకులు ఆనందోత్సవాల మధ్య ఉట్టిని కొట్టారు. గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. వీడీసీ చైర్మన్ ఏనుగు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గైని రాజలింగం, రాజిరెడ్డి, ముకేష్‌గౌడ్, రాజయ్య, మల్లేష్, మనోహర్, బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న చిన్నారులు

గోపాల్‌పేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో గోకులాష్టమి వేడుకలను స్వాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామప్రధాన కూడళ్లల్లో చిన్నారులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. దీంతోపాటు చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆధ్యాత్మికం

కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న సిద్ధరామేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ నిర్మాణ దాతలు కోలావార్(బిచ్కుంద), కాపర్తి(నిజామాబాద్) కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించారు.

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిపించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా నర్వ గ్రామ హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం దేవతామూర్తులకు మహిళలు కుంకుమార్చనలు చేశారు.

రాజరాజేశ్వరాలయాన్ని దర్శించుకున్న పైడి ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి: వెల్లుట్లపేట చెనింగ రాజరాజేశ్వరాలయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న శ్రావణమాసం భజనలు



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుస్వామి ఆలయంలో శ్రావణమాసం భజనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుస్వామి ఆలయంలో 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో భజన కళాకారులు కీర్తనలు, భజనలు చేస్తున్నారు.


ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌కు మాతృవియోగం



లింబాద్రిని పరామర్శిస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే


సిరికొండ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ రిక్క లింబాద్రికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి రిక్క లక్ష్మమ్మ శనివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. స్వగ్రామం సిరికొండ మండలం రావుట్లలో ఆమె అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధుశేఖర్ తదితరులు పాడె మోసి లింబాద్రిని పరామర్శించారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అంత్యక్రియల అనంతరం లింబాద్రిని పరామర్శించారు.

పంట రక్షణకు పాత చీరలు



బాల్కొండ: అడవి పందుల భారీ నుంచి మక్క పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. పాత చీరలను పంట చేనుకు రక్షణ కడుతున్నారు. మార్కెట్‌లో పాత చీరలను రూ.50 ఒక్కటి కొనుగోలు చేసి చీరలను చుట్టూ కంచె వేసినట్లు కడుతున్నారు. పంట రక్షణ కోసం రైతులకు అదనంగా ఖర్చు అవుతుంది. ప్రస్తుత సంవత్సరం మక్క పంటకు అడవి పందుల బెడద తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడ్కోల్‌లో..



సిరికొండ: అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి అన్నదాతలు వివిధ ప్రయోగాలు చేస్తుంటారు. రాత్రి వేళల్లో మొక్కజొన్న చేనుపై దాడి చేయడానికి వచ్చే అడవి పందులకు బెదురుగా కనబడటానికి చేను చుట్టూ పాత చీరలను రక్షణగా కడుతున్నారు. సిరికొండ మండలంలోని గడ్కోల్, న్యావనంది, నర్సింగ్‌పల్లి, చీమన్‌పల్లి, తాళ్లరామడుగు గ్రామాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అడవి పందుల నుండి కాపాడుకోవటానికి మొక్కజొన్న చేను చుట్టు పాత చీరలను బెదుర్లుగా వాడుతున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మోర్తాడ్ ఉన్నత పాఠశాల 1980-81 బ్యాచ్ విద్యార్థులు

మోర్తాడ్/ నిజామాబాద్ అర్బన్: మోర్తాడ్ ఉన్నత పాఠశాలలో 1980–81కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 45 ఏళ్ల తర్వాత నాటి మిత్రులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నగరంలోని శ్రీముక్క అయోధ్యరామ్ విద్యానికేతన్‌కు చెందిన 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల వ్యవస్థాపకుడు ముక్త దేవేందర్ గుప్తా, ఉపాధ్యాయులు సందీప్ కులకర్ణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



1995-96 శ్రీముక్క అయోధ్యరామ్ స్కూల్ విద్యార్థులు..

క్రైం కార్నర్

మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో దుండగులు శనివారం రాత్రి మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. నల్లవెల్లి శివారులో గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి, గన్నారం గ్రామానికి చెందిన సామల రాజేశ్, మెగ్యానాయక్ తండాకు చెందిన లంబాని రెడ్యా అనే రైతులకు చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు విషయం గమనించి లైన్‌మన్ నవీన్‌కి సమాచారం అందించారు. లైన్‌మన్ పంచనామా నిర్వహించి జరిగిన నష్టంపై పై అధికారులకు నివేదిక అందించారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన తెలిపారు.

పిచ్చి కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్దతడ్గూర్‌లో ఆదివారం పిచ్చికుక్కలు దాడి చేసిన ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో నడుచుకుంటు వెళ్తున్న సంజయ్, విఠబాయి, అనిల్, దాదారావు, నారాయణ, గంగాధర్‌లపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు గాయాలపాలైన వారిని మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని కనిపించిన వారందరిని గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నవీపేట: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి ఒకరు మృతి చెందిన ఘటన నవీపేట మండలం లక్ష్మాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్‌కు చెందిన గుడిమెట్ల శంకర్(45) రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలోని చింతల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం శంకర్ మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి కుమారుడు కార్తిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

- అనుమతులు గృహాలకు.. నడుస్తున్నది కమర్షియల్
- గ్రౌండ్ ఫ్లోర్‌కే పన్ను చెల్లింపులు.. పైఅంతస్తులకు ఎగవేత
- అక్రమ నిర్మాణాలకే పెనాల్టీ అంటున్న అధికారులు



బాన్సువాడ పట్టణం

బాన్సువాడ: మున్సిపల్ అధికారులు ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. అక్రమ ఇళ్ల నిర్మాణాలను గుర్తించే పనిలో పడ్డారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 10,122 గృహాలు.. 1,223 కమర్షియల్, వాణిజ్య, వ్యాపార దుకాణాలున్నాయి. కొంతకాలంగా పట్టణంలో గృహ నిర్మాణం పేరిట వాణిజ్య సముదాయాలు నడుపుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఉద్దేశంతో అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. గతంలో పట్టణాన్ని మూడు డివిజన్‌లుగా విభజించి ఇంటి పన్నులు విధించారు. ప్రస్తుతం పట్టణంలో ప్రతి ఇంటిని భువన్ సర్వే చేసి ఇంటి విస్తీర్ణాన్ని కొలతలు వేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. పాత ఇంటి పన్నుల ఆధారంగానే విస్తీర్ణాన్ని బట్టి ఇంటి పన్నులు విధిస్తున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఆదాయం ఏరియర్స్‌తో కలుపుకొని రూ.4.50 కోట్లు కాగా దాన్ని మరింత పెంచుకునే మార్గాలను మున్సిపల్ అధికారులు అన్వేషిస్తున్నారు. ప్రతీ ఏటా రివిజన్ నిర్వహించాల్సి ఉంటుంది.

గృహ నిర్మాణం పేరిట వాణిజ్యం..

పట్టణంలోని మెయిన్ రోడ్డు, పాత బాన్సువాడ రోడ్డు, బీసీ హాస్టల్ రోడ్డు, తాడ్కోల్ చౌరస్తా నుంచి తాడ్కోల్ వరకు, పాత అంగడి బజారు, కొత్త అంగడి బజారు, టీచర్స్ కాలనీ, గాంధీ చౌక్ రోడ్డు, జెండా గల్లీ తదితర రోడ్లలో కమర్షియల్ దుకాణాలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో చాలా వరకు అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకొని అందులో వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మున్సిపల్‌కు గృహ నిర్మాణ పన్నులు మాత్రమే చెల్లిస్తున్నారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్‌కు గృహ నిర్మాణ అనుమతి తీసుకుని మరో రెండు అంతస్తులు వేసి వ్యాపారాలు చేస్తున్నారు. పన్నులు మాత్రం చెల్లించడం లేదు. దీంతో ఆదాయానికి గండిపడుతోంది.

ఇంటి పన్నులు పెంచడం లేదు

పై అధికారుల ఆదేశాల మేరకే రివిజన్ నిర్వహిస్తున్నాం. పాత ఇంటి పన్నులకు కొత్తగా పన్నులు పెంచడం లేదు. అక్రమ నిర్మాణాలు, అనుమతులు తీసుకోని వాణిజ్య వ్యాపారం చేసుకుంటున్న వారికి పెనాల్టీ వేస్తున్నాం. పన్నులు అధికంగా వేశారని అనుకుంటే దరఖాస్తు చేసుకుంటే మళ్లీ రివ్యూ చేస్తాం.

– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ